# బీసీల వ్యతిరేకి బీజేపీ

- ఆ పార్టీకి బిల్డప్ ఎక్కువ.. పని తక్కువ
- బీసీ మహిళకు టికెట్ ఇచ్చి గుంజుకోవడం అన్యాయం..?
- బీఫాం ఇవ్వకుండా అవమానించడం బాధాకరం
- తుల ఉమ ఇంటి బిడ్డగా తిరిగి రావడం మాకు సంతోషం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్

వేములవాడ/కథలాపూర్, నవంబర్ 13: బీజేపీకి బిల్డప్ ఎక్కువ, పని తక్కువ అన్నట్లుగా బీసీ మహిళకు టికెట్ ఇచ్చి గుంజుకోవడం చాలా బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ మహిళా విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్ పర్సన్, ప్రస్తుత బీజేపీ సీనియర్ నాయకురాలు తుల ఉమ సోమవారం మంత్రి కేటీఆర్ ఆహ్వానం మేరకు మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. అనంతరం తుల ఉమతో పాటు వారి ముఖ్య అనుచరులు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు బీజేపీ టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి, బీఫాం ఇవ్వకుండా ఇచ్చిన సీటును గుంజుకోవడం చాలా బాధాకరమన్నారు. ఇది మహిళలకే కాకుండా బీసీలపై బీజేపీ వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. బీసీ ముఖ్యమంత్రిని చేస్తానని బిల్డప్ ఇచ్చిన బీజేపీ, బీసీ మహిళపై వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ఉద్యమ కాలం నుంచి సీనియర్ మహిళా నాయకురాలుగా, నాడు టీఆర్ఎస్ కేసీఆర్ గారి నాయకత్వంలో కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా, తెలంగాణ ఆడ బిడ్డగా, బీఆర్ఎస్ ఇంటిబిడ్డగా సేవలందించిన తుల ఉమక్కకు బీజేపీలో ఇలా అవమానం జరగడం బాధగా ఉందన్నారు. బలహీన వర్గాల ఆడబిడ్డకు ఇటువంటి అన్యాయం జరగడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం తెలియజేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు స్వయంగా తానే ఉమక్కకు ఫోన్ చేసి ఆహ్వానించానని, మా ఇంటి ఆడబిడ్డగా గులాబీ గూటికి తిరిగి చేరుకోవాలనే తన ఆహ్వానాన్ని మన్నించి రావడం సంతోషంగా ఉందన్నారు. తుల ఉమక్కకు గతంలో ఉన్న హోదాకంటే మరింత సమున్నత హోదాను, బాధ్యతలను అప్పగించి పార్టీ గౌరవించుకుంటుందని, ఇందుకు సంబంధించిన బాధ్యతను స్వయంగా తానే తీసుకుంటానని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో నిబద్ధత కలిగిన సైనికురాలిగా ఎలాంటి కల్మషం లేకుండా కలిసి పనిచేసిన తుల ఉమతో అంతే నిబద్ధతతో తిరిగి కలిసి పనిచేస్తామని చెప్పారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్రంలోని మహిళా అభ్యున్నతికోసం సేవలు అవసరమన్నారు. గతంలో కూడా రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా పార్టీ కోసం, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మహిళా అభ్యున్నతి కోసం కృషిచేసిన తుల ఉమక్కకు పుట్టిన గూటికి పునఃస్వాగతం అని మంత్రి కేటీఆర్ ఆహ్వానించారు.

**సొంత గూటికి ఉద్యమ నాయకురాలు ఉమ**

తుల ఉమ బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేశారు. ఉద్యమంలో చురుగ్గా వ్యవహరించారు. 2010-15 దాకా బీఆర్ఎస్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా, 2015-2021 వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2014లో కథలాపూర్ జడ్పీటీసీగా గెలిచారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ సీఎం కేసీఆర్ అవకాశం ఇవ్వడంతో 2019 దాకా పనిచేశారు. అంతకుముందు బీడీ కార్మిక నాయకురాలిగా పనిచేశారు. జూన్ 14, 2021లో బీజేపీలో చేరారు. అప్పటి నుంచి అదే పార్టీలో ఉన్న ఆమెను, ఈ ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి చివరి నిమిషంలో బీ ఫాం ఇవ్వకపోవడంతో అసంతృప్తి చెందారు. సోమవారం బీజేపీకి రాజీనామా చేశారు. మధ్యాహ్నం వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుతో కలిసి హైదరాబాద్ వెళ్లి మంత్రి కేటీఆర్ సమక్షంలో తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు.

**బీజేపీని నమ్మితే మిగిలేది ఏమీ ఉండదు**

బీజేపీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండదు. నాకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి దొంగ దారిన ఇంకొకరికి ఇచ్చారు. బీజేపీలో బీసీని సీఎం చేయడం అనేది ఒక కలే. అందుకు నేనే ఉదాహరణ. ఆ పార్టీ చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి. బీజేపీ అంటేనే అగ్రవర్ణాల పార్టీ. కింది స్థాయి కార్యకర్తలను వాడుకోవడమే వారి లక్ష్యం. గతం లో బీఆర్ఎస్‌లో మొదటి నుంచి ఉండి అనేక పదవుల్లో పనిచేశా. ఈ పార్టీలో మాత్రం ఆ గౌరవం దక్కలేదు. బీజేపీ కార్యకర్తలారా దయచేసి వినండి. ఆ పార్టీని నమ్ముకుంటే మిగిలేది ఏమీ ఉండదు. ఇప్పటికైనా తేరుకోవాలి. నా రాజకీయ జీవితంలో మధ్యలో కొద్దిగా సమస్య వచ్చినప్పటికీ ఇప్పుడు తిరిగి బీఆర్ఎస్‌లో చేరడం సంతోషంగా ఉన్నది. నా సొంత ఇంటికి వచ్చినట్టు ఉన్నది. మరింత ఉత్సాహంగా పనిచేస్తా. ప్రజలతో మమేకమై ముందుకుసాగుతా.

\- బీఆర్ఎస్‌లో చేరిన అనంతరం ఉమ



రామగుండం ఎన్టీపీసీ

# నాలుగున్నర దశాబ్దాల వెలుగుల దివ్వె

- నేటితో ఎన్టీపీసీకి 45 ఏండ్లు పూర్తి
- ఆవిర్భావ దినోత్సవం నేడే
- రైజింగ్ డే వేడుకలకు సిద్ధమైన యాజమాన్యం

జ్యోతినగర్, నవంబర్ 13 : దేశ ఆర్థికాభివృద్ధికి ముఖ్య భూమిక పోషిస్తూ.. తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమైన వెలుగుల దివ్వె ఎన్టీపీసీ ఆవిర్భవించి నాలుగున్నర దశాబ్దాలు పూర్తి చేసుకున్నది. రామగుండం కేంద్రంగా దక్షిణాది రాష్ట్రాలకు వెలుగులు పంచుతున్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన రామగుండం (నేషనల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు) 46వ వసంతంలోకి అడుగిడుతోంది. 1978 నవంబర్ 14న బొగ్గు ఆధారంగా శంకుస్థాపన జరిగిన ఈ ప్రాజెక్టు.. విద్యుత్ రంగంలో 2600 మెగావాట్ల వెలుగులను విరజిమ్మి దేశంలోనే ప్రథమంగా ఐఎస్‌వో 14001 సర్టిఫికెట్ పొందింది. తదనంతరం రామగుండం ఎన్టీపీసీ 10 మెగావాట్ల సౌరశక్తి ప్లాంటు, 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సౌరశక్తి ప్లాంటు, తెలంగాణ ప్రాజెక్టులో మొదటి దఫా 1600 మెగావాట్ల విద్యుదుత్పత్తిని ఇటీవల చేపట్టింది. నిర్దేశించిన విద్యుదుత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇక సామాజిక బాధ్యతల్లో ప్రభావిత గ్రామాలకు కొండంత అండగా నిలిచి సామాజిక సేవకు ప్రతిరూపంగా నిలుస్తోంది. ప్రభావిత గ్రామాల అభివృద్ధి కోసమే 2005లో సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ)పేరిట ప్రారంభించుకున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఏయేడు కాయేడు నిధులను పెంచుకుంటూ సామాజిక సేవను తన భుజాలపై వేసుకుంది.

**రామగుండం ఎన్టీపీసీ ప్రస్థానం**

దక్షిణాదికి వెలుగులను అందిస్తున్న రామగుండం ఎన్టీపీసీకి నిండు 45 ఏళ్లు నిండాయి. 1978 నవంబర్ 14న అప్పటి భారత ప్రధాని దివంగత మొరార్జీ దేశాయి రామగుండం ఎన్టీపీసీకి శంకుస్థాపన చేయగా, వెలుగుల విస్తరణ 2600 మెగావాట్లకు చేరింది. మొత్తం ప్లాంటులో ఏడు యూనిట్లను ఏర్పాటు చేయగా స్టేజీ-1 కింద 200 మెగావాట్ల చొప్పున 3 యూనిట్లలో 600 మెగావాట్లు, స్టేజీ-2 కింద 500 మెగావాట్ల చొప్పున 3 యూనిట్లలో 1500 మెగావాట్లు, స్టేజీ-3 కింద మరో 500 మెగావాట్ల యూనిట్ చొప్పున మొత్తం ఏడు యూనిట్లలో 2600 మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించింది. యూనిట్ల నిర్మాణపు వ్యయంలో స్టేజీ-1, 2 యూనిట్లకు రూ. 2059.22 కోట్లు, స్టేజీ-3 యూనిట్‌కు రూ.1818.46 కోట్లను ఖర్చు చేశారు. బొగ్గు వినియోగం స్థానిక సింగరేణి బొగ్గు గనుల నుంచి రోజుకు 32 వేల మెట్రిక్ టన్నుల కోల్ లింకేజీ, ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి 8 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు లింకేజీ ఒప్పందంతో ప్రాజెక్టుకు నిత్యం బొగ్గు దిగుమతి అవుతోంది. అలాగే, ప్రాజెక్టుకు 6.5 టీఎంసీల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎన్టీపీసీ రిజర్వాయర్‌కు సరఫరా అవుతోంది.

**నేడు రైజింగ్‌డే వేడుకలు**

రామగుండం ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఎన్టీపీసీ యాజమాన్యం ఎన్టీపీసీలో రైజింగ్‌డే వేడుకలు చేపట్టింది. ఉదయం 8.15 గంటలకు టౌన్‌షిప్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పెద్ద ఎత్తున మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించనుంది. 8.55 గంటలకు ఎన్టీపీసీ పరిపాలన భవన్‌లో సీజీఎం జెండా ఆవిష్కరించి, ఎన్టీపీసీ పురోగతిని వివరించనున్నారు.

# లక్ష మందితో ప్రజా ఆశీర్వాద సభ



సీఎం సభ కోసం డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, తదితరులు

- ఈ నెల 17న ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహణ
- హాజరు కానున్న సీఎం కేసీఆర్
- బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు తరలిరావాలి
- బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- సభ కోసం కళాశాల క్రీడా మైదానం పరిశీలన

జమ్మికుంట, నవంబర్ 13: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో లక్ష మందితో ప్రజా ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నామని, ఈ నెల 17న జరిగే సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. సీఎం సభ కోసం కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సోమవారం పాడి కౌశిక్‌రెడ్డి జమ్మికుంటకు వచ్చారు. కళాశాల క్రీడా మైదానాన్ని సందర్శించారు. సభాస్థలిని పరిశీలించారు. సభా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, సభకు హాజరయ్యే ప్రజల రూట్ మ్యాప్, తదితర అంశాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులతో చర్చించారు. అనంతరం మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ సభ కనీవిని ఎరుగని తరహాలో నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేశామని, సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లక్ష మంది కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, వాహనాలు నిర్దేశించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్టేజీ వద్ద అతిథులు, వీఐపీలు, మీడియా ప్రతినిధులు, తదితరుల కోసం ప్రత్యేక గ్యాలరీలు కేటాయించనున్నట్లు వెల్లడించారు. అనంతరం సీఎం సభకు వచ్చే రూట్‌ను చూశారు. తర్వాత నాయిని చెరువు వద్దకు వెళ్లారు. హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ అర్బన్‌పార్టీ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్పన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వాలా బాలకిషన్‌రావు, పొల్నేని సత్యనారాయణరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ పోడేటి రామస్వామి, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

**హెలీప్యాడ్, సీఎం సభాస్థలాన్ని పరిశీలించిన ఏసీపీ**

ఈ నెల 17న సీఎం జమ్మికుంటకు రానున్న సందర్భంగా జమ్మికుంట టౌన్, రూరల్ సీఐలు రమేశ్, కిశోర్‌కుమార్‌తో కలిసి హుజూరాబాద్ ఏసీపీ ఎల్ జీవన్‌రెడ్డి నాయిని చెరువు వద్దగల హెలీప్యాడ్, సీఎం సభాస్థలాన్ని పరిశీలించారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకు సీఎం వచ్చే వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఐలకు సూచించారు. సభావేదిక, గేట్లు, రూట్‌మ్యాప్‌లు, వాహనాల పార్కింగ్, తదితర అంశాలపై చర్చించారు. తగు సలహాలు, సూచనలు అందించారు. ఇక్కడ సీఐలతో పాటు సిబ్బంది ఉన్నారు.

# సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మేయర్

కార్పొరేషన్, నవంబర్ 13: కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 17న సీఎం కేసీఆర్ హాజరయ్యే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు సోమవారం పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు చల్ల హరిశంకర్, నందెల్లి మహిపాల్‌తో కలిసి ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. అలాగే శాతవాహన యూనివర్సిటీలో సీఎం కేసీఆర్ హెలీప్యాడ్ ఏర్పాటు చేయనుండగా, అక్కడ నుంచి ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానానికి వచ్చే రోడ్డు పరిస్థితులపై సమాలోచనలు చేశారు. ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు వచ్చే ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ వై.సునీల్‌రావు తెలిపారు. మహిళలు, పురుషులు, యువత కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే వచ్చే ప్రజలకు వాహనాల పార్కింగ్‌లో ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా విషయంలోనూ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు చెప్పారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చే ప్రజలకు సమస్యలు, ఇబ్బందులు రాకుండా ఈ సభకు విజయవంతం కోసం తగిన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వచ్చే ప్రజలకు ఎండతో ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కర్ర రాజశేఖర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.